'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

సకల జనుల మ్యానిఫెస్టో

తెలంగాణ విముక్తి ప్రదాతే బంగారు భవితకు బాటలు వేసిన నవయుగ నిర్మాత కావడం ఓ చారిత్రక విశేషం. సకల జనులనూ ఒక్కటిచేసి రాష్ట్ర సాధన ఉద్యమం నడిపిన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నివర్గాల ప్రజల సంక్షేమం ధ్యేయంగా, సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా పరిపాలన చేపట్టారు. తెలంగాణ కీర్తికాంతులు దశదిశలా విస్తరించేలా చల్లనిపాలన అందించారు. రెండు విడతలు ప్రజలు జేజేలు పలికి అధికారం ఇచ్చారు. ఇప్పుడు మూడో విడతకు సమయం వచ్చింది. సాధించినదానితో సంతృప్తిని చెందడం సీఎం కేసీఆర్ డిక్షనరీలోనే లేదు. నిరంతరం నిత్య నూతనంగా ఆలోచించడం, వ్యూహాలు నిర్దేశించుకొని గమ్యాన్ని ముద్దాడటం తనకు వెన్నతో పెట్టిన విద్య. రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆయన విడుదల చేసిన మ్యానిఫెస్టో మూడో విడత పరిపాలన ప్రణాళికలను ఆవిష్కరించింది.

సీఎం కేసీఆర్ ఊహల్లో రూపుదిద్దుకున్న రైతుబంధు పథకం సాగు చరితలో ఓ వినూత్న అధ్యాయం. దేశంలోని రైతాంగం దృష్టిని ఆకర్షించిన ఈ పథకం కింద ప్రస్తుతం ఎకరానికి ఏటా ఇస్తున్న సాయం పది వేలను దశలవారీగా పదహారు వేలకు పెంచుతామని ప్రకటించడం శుభపరిణామం. అన్నదాతల కళ్లల్లో సంతోషాన్ని నింపే హామీ ఇది. రేషన్‌పై సన్నబియ్యం ఇస్తామనే హామీ ఆచరణాత్మకమైందే కాదు, ఆహ్వానించదగినది కూడా. ఇచ్చిన బియ్యం దారి మళ్లకుండా సద్వినియోగమయ్యేందుకు దోహదం చేసే చక్కని ఆలోచన. ఐదు లక్షల జీవిత బీమా రూ.15 లక్షల ఆరోగ్యబీమా అందించడం పేద కుటుంబాలకు ధీమా కల్పిస్తుందని చెప్పవచ్చు. ఈ రెండు పథకాలకు సీఎం కేసీఆర్ పేరు పెట్టడం సముచితం. ఆసరా పింఛన్లను దశలవారీగా రూ.5016కు పెంచుతామన్న ప్రతిపాదన వృద్ధులకు, ఇతరులకు లబ్ధి చేకూరుస్తుంది. నిరుపేదలకు నీడ కల్పించేందుకు ఉద్దేశించిన డబుల్ బెడ్రూం పథకం కింద హైదరాబాద్ నగరంలో మరో లక్ష ఇండ్లు నిర్మించనున్నట్టు తెలిపారు. కేంద్రం పెట్టిన వంటగ్యాస్ మంట నుంచి గృహిణులను విముక్తం చేసేందుకు సిలిండర్‌ను రూ.400కే ఇస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొన్నారు. కాంట్రిబ్యూటరీ పింఛన్ స్థానంలో పాత పింఛన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ఉద్యోగులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. ఈ అంశాన్ని పరిశీలించేందుకు కమిటీ వేయనున్నట్టు ప్రకటించడం ఉద్యోగుల సంక్షేమం పట్ల సీఎం కేసీఆర్‌కు గల నిబద్ధతకు నిదర్శనం. ఇలా ఒక్కో వర్గం గురించి ఆచితూచి అంచనాలు వేసి మ్యానిఫెస్టోను రూపొందించారని చెప్పవచ్చు.

చెప్పినవి చేయడం, చెప్పనివీ చేయడమనేది బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ విధానం. మ్యానిఫెస్టో అనేది ఆయన దృష్టిలో ఓట్ల కోసం విసిరే వల ఎంతమాత్రం కాదు. ఆచరణ సాధ్యం కాని హామీలివ్వడం, ఆపై మరిచిపోవడమనేది ఆయన చరిత్రలోనే లేదు. తొందరపడి మాట ఇవ్వరు. ఇస్తే దాన్ని నిలబెట్టుకునేందుకు ఎంతదాకానైనా పోతారు. అగ్గాసు తరహాలో కాంగ్రెస్ ఇచ్చిన అమలుకు నోచుకోని హామీలు కావివి. ఖర్చెంత అవుతుందో తెలియకుండానే, ఓటరును బులిపించే మాయదారి హామీలు అసలే కావు. రెండు విడతల పాలన విజయాలను ముందుకు తీసుకువెళ్లే రీతిలో బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో రూపొందించారనడం అతిశయోక్తి కాదు. అన్నివర్గాల అభ్యున్నతికి ఉద్దేశించిన సమతుల అంశాలు ఇందులో ఉన్నాయి. వీటిలో కొన్నిటిని దశలవారీగా పెంచుతామనడం ఆచరణాత్మకతకు గీటురాయి.

నయవంచనే కాంగ్రెస్ నైజం

ఉద్యమంలో చొరబడటం.. చేతిలోకి తీసుకోవడం.. ద్రోహం చేయడం 70 ఏండ్ల పాటు ఈ ప్రాంతంలో ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన పోరాటంలో ఇదే కాంగ్రెస్ పోషించిన పాత్ర. ఒక్కరంటే ఒక్క నాయకుడు కూడా తెలంగాణకు చివరిదాక కట్టుబడిన దాఖలా లేదు. రాష్ట్ర సాధనకు రోడ్‌మ్యాప్ వేసిన నాయకుడు అంతకన్నా లేదు. ఎవరో రేపిన ఉద్యమ వేడిని ఎన్నికల పెనంగా వాడేసుకోవడం, అధికారం దక్కగానే మాట మార్చేయడం తెలంగాణ కాంగ్రెస్ చరిత్ర అంతా ఇంతే!

డాక్టర్ ఎంఏ శ్రీనివాసన్

60 ఏండ్ల ద్రోహ చరిత 5



ఎన్నికల రుతువు చాలా విచిత్రమైనది. తెలంగాణ పేరిట ప్రతీ ఎన్నికల సీజన్‌లో మోసం చేయటం కాంగ్రెస్ పార్టీ అలవాటు. తెలంగాణ కాంగ్రెస్ నాయకులు డూడూ బసవన్నలు, ఉత్సవ విగ్రహాలు.. ఢిల్లీ అధిష్ఠానానికి విధేయులు, ఆంధ్రా కాంగ్రెస్ నాయకుల అనుయాయులు మాత్రమే. ఇవన్నీ ఆరోపణల్లాగా అనిపించవచ్చు కానీ, వారి ఆచరణ మాత్రం అదే విషయాన్ని ఎత్తి చూపుతుంది. 'అధిష్ఠానం కొంచెం బిజీగా ఉంది అందుకే తెలంగాణ గురించిన ఆలోచన కొంత లేట్ అవుతుంది', 'వేరే రాష్ట్రాల్లో ఎన్నికలున్నాయి.. అందుకే ఇప్పుడే తెలంగాణ గురించి మాట్లాడలేం', 'ఎన్నికలు అయిపోగానే తెలంగాణ గురించి ముందడుగు వేస్తాం'. ఇట్లా రకరకాల సాకులతో తెలంగాణను పోస్టుపోన్ చేస్తూ వచ్చింది కాంగ్రెస్. కాలయాపన టెక్నిక్‌లు కాంగ్రెస్ అమ్ముల పొదిలో ఎన్నో ఉన్నాయి. ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలతో మొదలుపెట్టి, కమిటీలు, కమిషన్లు, కోర్టు తీర్పులు... ఇట్లా అన్నిరకాల డిలే టాక్టిక్స్, అంటే నీరుకార్చే పద్ధతులను ప్రయోగించారు.

వాళ్లు కొట్టుకుంటే ఇక్కడ దెబ్బలు..

కాంగ్రెస్ పార్టీలో జరిగే అంతర్గత సంక్షోభానికి కూడా బలైంది తెలంగాణనే. 1969లో కేంద్ర కాంగ్రెస్ పార్టీలో సంక్షోభం వస్తే దెబ్బతిన్నది తెలంగాణ ఉద్యమం. ఇందిరా గాంధీ, నిజలింగప్పల మధ్య ఆధిపత్య పోరులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి బలపడ్డాడు. దాని ఫలితమే 1969 'జై తెలంగాణ' ఉద్యమంలో ఉద్యమకారులను కాల్చి పడేసినా కేంద్ర కాంగ్రెస్ నాయకులకు చీమ కుట్టినట్టు కాలేదు. చివరికి 1969 ఆగస్టు అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణను సమర్థిస్తున్న తెలంగాణ కాంగ్రెస్ సభ్యులు, కె.రామచంద్రారెడ్డి, రాజమల్లు ఆధ్వర్యంలో 20 మంది తెలంగాణ కాంగ్రెస్ సభ్యులు వాకౌట్ చేసి ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'తెలంగాణలో 200 మందికి పైగా ప్రజలను పొట్టన పెట్టుకున్నది' అని ఆరోపించినా, తెలంగాణ కాంగ్రెస్ శాసనసభ్యులు పాల్వాయి గోవర్ధనరెడ్డి, జేవీ సుధాకర్‌రావు, ఈశ్వరీబాయి అరెస్టయినా ఇందిరా గాంధీకి పట్టలేదు, బ్రహ్మానందరెడ్డి ఆధిపత్యమే కొనసాగింది. తెలంగాణ కోసం ఏర్పాటైన తెలంగాణ ప్రజా సమితి 1971 పార్లమెంటు ఎన్నికల్లో ఘన విజయం సాధించినా ఆర్నెల్లు కాగానే కాంగ్రెస్‌లో విలీనం చేసి తెలంగాణ ఉద్యమాన్ని చల్లార్చిన పాపం అటు ఇందిరాగాంధీ, ఇక్కడ కాంగ్రెస్ నాయకులు పంచుకోవాల్సిందే. 10 మంది ఎంపీల్లో ఇద్దరు తప్ప మిగతా అందరూ కాంగ్రెస్ అధిష్ఠానానికి లొంగిపోయారు. వారి వెంటే అధ్యక్షుడు చెన్నారెడ్డి కూడా తలొగ్గి ఉద్యమాన్ని చల్లబరచడంలో తన వంతు పాత్ర పోషించారు. 1971లలో తగ్గుముఖం పట్టిన ఉద్యమం మళ్లీ 30 ఏండ్లకు ఒక ప్రజా ఉద్యమంగా మొదలయ్యే వరకు తెలంగాణ సమాజం అనుభవించిన వివక్షకూ, అన్నిరకాల పరాయీకరణలకు కాంగ్రెస్‌దే బాధ్యత.

2004 ఎన్నికల్లోనూ మోసం

1998ల నుంచి తెలంగాణలో ప్రత్యేక ఉద్యమానికి కావలసిన వాతావరణం పెరుగుతూ వచ్చింది. మరోవైపు టీడీపీపై వ్యతిరేకత పెరుగుతున్న కాలం. అపుడే కాంగ్రెస్ జెండాతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రెండు ముఖ్య అంశాలతో ముందుకొచ్చాడు. ఒకటి నక్సలైట్లతో చర్చలు జరిపి శాంతిని స్థాపించడం, రెండోది ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుకు సమర్థన. ప్రతీ కాంగ్రెస్ నాయకుడి లాగానే ఈ రెండు అంశాలను కూడా తనకు అనుకూలంగా మలుచుకొని అధికారంలోకి వచ్చి తర్వాత ఘోర తెలంగాణ విరోధిగా మారాడు. తెలంగాణ ఏర్పాటుకు ఒక మార్గం అనుకున్న 2004 ఎన్నికలు కాంగ్రెస్ చేసిన మోసానికి సాక్ష్యంగా నిలిచాయి. టీఆర్‌ఎస్ వరంగల్ బహిరంగసభకు వచ్చిన 15 లక్షల మంది ప్రజలను చూసి కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం భయపడిపోయింది, ప్రత్యేకంగా సోనియాను ఆలోచింపజేసేలా చేసింది. తెలంగాణ నినాదం కాంగ్రెస్‌ను అధికారానికి చేరువ చేస్తుందని తెలిసిపోయింది. అప్పటినుంచి ప్రతీ ఎన్నికలో మొదట కాంగ్రెస్ ఆ తర్వాత తెలుగుదేశం, ఎక్కడా పోటీలో లేని బీజేపీ కూడా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనే అంశాన్ని ఎన్నికల్లో తురుపుముక్కగా వాడుకున్నాయి.

సాగదీతకు సాకులు..

ఎన్నికల ప్రణాళికలో అస్పష్టంగా తెలంగాణ విషయంలో 'మొదటి స్టేట్ రీ ఆర్గనైజింగ్ కమిటీ నివేదికలో వెల్లడించిన అభిప్రాయాలను గౌరవిస్తామని' ప్రకటించి పొత్తు కుదుర్చుకున్నది. తర్వాత యూపీఏ ప్రభుత్వం కామన్ మినిమం ప్రోగ్రాంలో చేర్చింది కాంగ్రెస్. రాష్ట్రపతి అబ్దుల్ కలాం ప్రసంగంలో కూడా 'కాన్సెన్సస్' అంటే ఏకాభిప్రాయంతో తెలంగాణ ఏర్పాటు అంశాన్ని చేపడుతామని పేర్కొన్నది కాంగ్రెస్. ఇక్కడినుంచే మోసం మొదలవుతుంది. కాన్సెన్సస్ అనే పదాన్నే రాజశేఖర్‌రెడ్డి ఆయుధంగా మార్చుకొని తెలంగాణ ఏర్పాటును అడ్డుకోవడం మొదలుపెట్టిండు. అప్పటి నుంచి తెలంగాణ ఏర్పడేవరకు ఈ కాన్సెన్సస్ పదమే తెలంగాణ వ్యతిరేకులకు ఆయుధంగా నిలిచింది.

2005 మార్చిలో ప్రణబ్ ముఖర్జీ కమిటీని ఏర్పాటుచేసి 8 వారాల్లో నివేదికను ఇవ్వాల్సి ఉంటే 80 వారాలైనా నివేదిక లేదు. పైగా రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాను ఉపయోగించుకొని తెలంగాణ వ్యతిరేక చర్యలు ఎన్నో చేశాడు. లోక్‌సభలో దాదాపు 440 మంది సభ్యులు మద్దతు ఇస్తున్నప్పటికీ తెలంగాణ ఏర్పాటుకాకపోవటానికి కాంగ్రెస్ పార్టీ కారణం కాదా? విచిత్రమేమంటే అన్ని రాజకీయపక్షాలు తెలంగాణకు తమ సమ్మతిని లిఖిత పూర్వకంగా ఇస్తే కాంగ్రెస్ మాత్రం కుంటిసాకుతో లిఖితపూర్వక హామీ ఇవ్వలేదు. ఈ విధంగా కాంగ్రెస్ అధిష్ఠానం, ఇటు తెలంగాణ కాంగ్రెస్ వాళ్లను మభ్యపెడుతూ, ఇంకోవైపు సీమాంధ్ర లాబీయింగ్‌కు మద్దతు ఇస్తూ పబ్బం గడుపుకొన్నది.

కత్తి అందించేది కాంగీయులే!

2004 కరీంనగర్ సభలో సోనియాగాంధీ 'తెలంగాణ ప్రజల మనోభావాల పట్ల నాకు పూర్తి అవగాహన ఉంది' అని చెప్పిన మాటను నమ్మిన తెలంగాణ ప్రజలకు సోనియా ఇచ్చిన బహుమతి గులాంనబీ ఆజాద్, వైఎస్ రాజశేఖర్ రెడ్డిల చేతిలో తెలంగాణ భవిష్యత్తును పెట్టడం. 1972లో ఇందిరాగాంధీ తెలంగాణ ప్రజా సమితిని చీల్చినట్టే, టీఆర్‌ఎస్ సభ్యులను చీల్చి కాంగ్రెస్‌లో కలుపుకొని తెలంగాణ ఉద్యమం పీక పిసికే ద్రోహానికి ఒడిగట్టిన రాజశేఖరరెడ్డిని తెలంగాణ కోరుకునే వారెవ్వరూ ఏనాడూ కలలో కూడా సమర్థించరు. కానీ, వైఎస్ హయాంలో తెలంగాణ ఏమైపోతే ఏంటి? ప్రజలు ఏ గంగలో కలిస్తే మాకేంటి? అనుకొని వైఎస్ చుట్టూ తిరిగి కోట్లు కుమ్మేసుకొని ఆయన పాలనను 'రాజన్న రాజ్యం' అని ఇప్పటికీ ప్రేమగా చెప్పుకొనే భృత్య, వ్యర్థ, బానిస నాయకులకు తెలంగాణ కాంగ్రెస్‌లో కొదవలేదు.

2009 ఎన్నికల్లో తొలగిన కాంగ్రెస్ ముసుగు

'ఏరు దాటేదాకా ఓడ మల్లన్నా, ఏరు దాటినాక బోడి మల్లన్నా' అనే సామెత కాంగ్రెస్‌కు బాగా వర్తిస్తుంది. 2004లో గెలుపు కోసం తెలంగాణ ఇస్తానన్న కాంగ్రెస్, ఐదేండ్లు ఏం చేయకుండా, 2009లో మళ్లీ తెలంగాణ హామీని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టింది. కాంగ్రెస్‌తో సహా అన్ని పార్టీలు తెలంగాణ తెస్తామనే హామీతో ఎన్నికల్లో ముందుకొచ్చినాయి. మొదటి దశలో తెలంగాణలో ఎన్నికలు పూర్తికాగానే 'హైదరాబాద్‌కు పోవాలంటే వీసా తీసుకోవాల్సి ఉంటుందని ఆంధ్రా, రాయలసీమలలో ఓటర్లను బెదిరించి' రాజశేఖర్‌రెడ్డి ఓట్లు అడుక్కుంటే ఎదిరించినవాళ్లు లేరు. ఏదేమైనా ఎన్నికల్లో తెలంగాణను మోసం చేయడం కాంగ్రెస్‌కు రెగ్యులర్ అలవాటే. ప్రభుత్వ వ్యతిరేక ఓటు ప్రజారాజ్యం పుణ్యాన చీలినప్పటికీ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వానికి కేవలం 8 సీట్ల ఆధిక్యం వచ్చింది. కాంగ్రెస్ దగా మళ్లీ పునరావృతమైంది. 1971, 2005లో లాగానే గెలిచిన 10 మంది టీఆర్‌ఎస్ సభ్యులను చీల్చి తెలంగాణ కోసం పనిచేసే పార్టీ కూడా ఉండకుండా చేసే విఫల ప్రయత్నం చేసింది.

అతి పెద్ద ద్రోహి..కాంగ్రెస్సే!

తెలంగాణ సాధనకు పార్లమెంటరీ ప్రక్రియ ఒక ముఖ్య సాధనమైనా, ద్రోహం జరిగిన ప్రతిసారి తెలంగాణ ఉద్యమం మాత్రం ప్రజా సమస్యల నుంచే ఫీనిక్స్ పక్షిలా ఉవ్వెత్తున లేస్తూనే వచ్చింది. ఎన్నికల ద్వారా, పార్లమెంటరీ ప్రక్రియ ద్వారా రాష్ట్ర సాధనకు మార్గం ఏర్పడుతుందన్న నమ్మకంతోనే తెలంగాణ ఉద్యమం ఆ దిశగా చూసింది. ఈ ఆశను, ఆకాంక్షను ఒక బలహీనతగా భావించిన అన్ని రాజకీయపార్టీలు ఎన్నికల మ్యానిఫెస్టోల పేరుతో మోసం చేస్తూనే వచ్చాయి. అయితే ఈ ద్రోహంలో అతిపెద్ద వంతు మాత్రం, దేశ, రాష్ట్ర రాజకీయాల్లో అత్యధిక కాలం అధికారానికి అతుక్కొని ఉన్న కాంగ్రెస్ పార్టీదే.

మానవాభివృద్ధికి పెద్దపీట

బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ఆదివారం నాడు విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రముఖంగా కనిపించేది మానవాభివృద్ధికి పెద్దపీట వేయడం. రాష్ట్ర ఆర్థికాభివృద్ధితో పాటు మానవాభివృద్ధి సమాంతరంగా జరగాలన్నది మొదటినుంచీ ఆయన ఫిలాసఫీ. 'సంపదలు పెంచుదాం, ప్రజలకు పంచుదాం' అన్న ఒక్క వాక్యంలోనే ఆ ఫిలాసఫీ వేద మంత్రం వలె ధ్వనిస్తుంది. గతంలో పలుమార్లు ప్రకటించిన ఈ విషయాన్నే ఆయన మ్యానిఫెస్టో విడుదల సందర్భంగా పునరుద్ఘాటిస్తూ, పదేండ్ల పాలనలో తాము అమలుచేస్తున్న విధానాలే ఇందుకు నిదర్శనమని చెప్పటం గమనించదగ్గది.

టంకశాల అశోక్

ఒక ఉదాహరణ చూడండి. గత వారమే విడుదలైన ప్రపంచ దేశాల ఆకలి సూచీ మోదీ పాలనలో భారతదేశపు ర్యాంకు 125 దేశాలలో 111వది. ఈ ర్యాంకు 2014లో 55. అనగా రెట్టింపు స్థాయికి పతనమైంది. ఐక్యరాజ్యసమితి మానవాభివృద్ధి సూచీలో 190 దేశాలలో ఇండియా ర్యాంకు 130కి పైగానే. గత 20 ఏండ్లుగా ఇదే పరిస్థితి. మరొకవైపు రైతులు కష్టించి పండించే ధాన్యానికి కొరత లేదు. నానాటికి శతకోటి కోటీశ్వరులవుతున్నవారికి కొరత లేదు. ధనవంతులకు లక్షల కోట్ల రుణాల మాఫీకి సమస్య లేదు. దేశ జీడీపీ ప్రపంచంలో ఐదవ స్థానానికి పెరిగిందంటారు. పేదరికానికి సంబంధించిన అన్ని ర్యాంకుల్లో మాత్రం నిన్న కాంగ్రెస్ పాలించినా, నేడు బీజేపీ పాలిస్తున్నా దేశానిది అధ్వాన్న స్థితే.

కేసీఆర్ పదే పదే ఎత్తిచూపుతున్నది ఈ దౌర్భాగ్య పరిస్థితినే. ఉద్యమకాలం నాటికే తన కు కలిగిన ఈ అవగాహన ఒకవైపు, స్వయంగా తన తెలంగాణ ఆర్థిక, సామాజిక స్థితిగతుల వెనుకబాటుతనం ప్రభావం మరొక వైపు కలగలిసి ఆయనలో ఈ ఫిలాసఫీని రూపుదిద్దాయి. అందువల్లనే ఈ పదేండ్లుగా, ఎక్కడా వీసమెత్తు తేడా లేకుండా, కేసీఆర్ మ్యానిఫెస్టోలు, బడ్జెట్లు, విధానాలు, పరిపాలనా చర్యలు సమస్తం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, సంక్షేమ రూపంలో మానవాభివృద్ధికి సమానమైన ప్రాధాన్యం ఇస్తూ వస్తున్నాయి. అందుకే ఈ రోజున, కేవలం పదేండ్లు ఇంకా పూర్తికాకుండానే, ఒకప్పటి తెలంగాణ ఇప్పుడెట్లా ఉన్నదనే మాట ఇక్కడి ప్రజల్లోనే కాదు, దేశమంతటా అబ్బురంగా వినవస్తున్నది. చివరికి తెలంగాణ నుంచి విడిపోయిన పక్క రాష్ట్రంవారు సైతం, 170 ఏండ్లకిందటే కృష్ణా, గోదావరి ఆనకట్టలు కట్టుకొని వర్ధిల్లినవారు, అక్కడి సంపన్నులు, సామాన్యులు కూడా, ఈ రోజున, తమకు తెలంగాణ వంటి నాయకత్వం ఉంటే ఎంత బాగుండేదని విస్తృతంగా వ్యాఖ్యానిస్తున్నారు.

దీనికంతటికీ మూలమంత్రం 'సంపదలు పెంచటం, వాటిని ప్రజలకు పంచటమనే' కేసీఆర్ ఫిలాసఫీ. ఆదివారం నాటి మ్యానిఫెస్టోలో ప్రకటించిన అంశాలను ఒక్కసారి పరిశీలిస్తే బీఆర్‌ఎస్ పార్టీ మానవాభివృద్ధిని ఏ విధంగా సంకల్పిస్తుందనేది తేటతెల్లమవుతుంది. ముఖ్యంగా తెలంగాణ వంటి ఒక వర్ధమాన సమాజంలో వ్యవసాయం సహా వివిధ వృత్తుల వారు, కుటుంబాలు, వ్యక్తులు, నిరాధారులైన బలహీనులు, వ్యవస్థ నిర్మాణంలోని లోపాల కారణంగా అణగారుతున్న సామాజిక వర్గాలూ, ఆర్థిక-సామాజిక కోణాలలో- వ్యక్తిగత స్థాయిలోనూ ముందుకు పోగలిగే అవకాశాలు లభించినప్పుడే మానవాభివృద్ధి సాధ్యమవుతుంది. వారికి ఆర్థికాభివృద్ధి ద్వారా ఒక పునాది ఏర్పడి, దాని ఆధారంగా తమ మానవాభివృద్ధికి అవకాశాలు లభిస్తాయి.

ఈ తొమ్మిదేండ్లలో కేసీఆర్ చేసింది, ఇప్పుడు మరొక మ్యానిఫెస్టో ద్వారా కొనసాగించబూనుతున్నది అదే. అన్నింటికన్న ముఖ్యంగా 93 లక్షల తెల్లరేషన్ కార్డు కుటుంబాలకు రైతుబీమా పద్ధతిలోనే రూ.5 లక్షల కేసీఆర్ బీమా, రైతుబంధు సహాయాన్ని రూ.16,000కు పెంచటం, బీపీఎల్ కుటుంబాల మహిళలకు కొత్తగా నెలకు రూ.3,000, ఆసరా పింఛన్లు, వికలాంగుల పింఛన్ల పెంపు, ఆరోగ్యరక్ష పరిమితి రూ.15 లక్షలకు హెచ్చింపు, మరో లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్లు, అనాథ పిల్లల విధానం, అసైన్డ్ భూములపై ఆంక్షల ఎత్తివేత వంటివన్నీ మానవాభివృద్ధి చర్యలే. విషయాన్ని సరైన దృక్పథంతో అర్థం చేసుకోలేనివారు, దురుద్దేశాల వారు వీటిని జనాకర్షణ అని, పాప్యులిజం అని మాట్లాడవచ్చు. కొందరు సంక్షేమం అనవచ్చు. కానీ, సంక్షేమం అన్న మాట కూడా అసంపూర్ణమైన పదమే. సంక్షేమ రూపంలో ఉండే చర్యలు వాహికలు, లేదా సాధనాలు. వాటి లక్ష్యం మాత్రం మానవాభివృద్ధి. ఆ వర్గాల ప్రజలను కేవలం ఆకలి దప్పులు, ఇతర మౌలిక అవసరాల కొరతల్లేకుండా జీవింపజేయటం మాత్రమే కాదు. ఒరిజినల్‌గా బిస్మార్క్ తలపెట్టినట్టు ఆ వర్గాలలో అశాంతి తలెత్తకుండా జాగ్రత్తపడటమే కాదు. ఆ వర్గాలకు క్రమక్రమంగా తక్కిన సమాజ ప్రజల వలెనే సామాజికాభివృద్ధి అవకాశాలు లభించాలి. వారు జీవితంలో ఎదగాలి. అదే ఒక ధర్మ సమాజం అవుతుంది. అటువంటి పాలకుడే ధర్మ పాలకుడవుతాడు. కేసీఆర్ ఇన్నేండ్ల ఆలోచనలను, మాటలను, చేతలను, వాటి ఫలితాలను, ప్రభావాలను సూక్ష్మంగా పరిశీలించినప్పుడు ఈ ధోరణులు స్పష్టంగా కనిపిస్తాయి.

ఆదివారం నాడు మ్యానిఫెస్టో ప్రకటించిన ముఖ్యమంత్రి, ఇంతకుముందటి మానవాభివృద్ధి కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతూనే ఈ కొత్తవి అమలుకు వస్తాయన్నారు. మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చినవి అయినా అమలుచేయకపోవటం ఇతర పార్టీ ప్రభుత్వాల ఆనవాయితీ కాగా, తమ ప్రభుత్వం అట్లా చెప్పనివి సైతం కొల్లలుగా అమలుపరచటాన్ని ఆయన గుర్తుచేస్తున్నారు. వాటిలో భారీ ఖర్చుతో కూడుకొని, లక్షలాదిమంది గల విస్తృతమైన వర్గాల జీవితాలనే మార్చివేస్తున్న రైతుబంధు, రైతుబీమా, దళితబంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, బీసీ బంధు, కొత్తగా స్కూలు పిల్లలకు ప్రవేశపెట్టిన బ్రేక్‌ఫాస్ట్ పథకం వంటివి ఉన్నాయి. ఈ విధంగా పాతవి, కొత్తవి అన్నీకలిసి తెలంగాణ రాష్ట్రాన్ని, కేసీఆర్ పాలనలో, మరొక ఐదేండ్లు గడిచేసరికి మానవాభివృద్ధిలోని అన్ని అంశాల్లో మొత్తం దేశంలోనే అగ్రగామిగా నిలిపితే ఆశ్చర్యపడనక్కరలేదు.

తలసరి ఆదాయం, విద్యుత్తు వాడకం, ధాన్యం దిగుబడి తదితర ఆర్థికాభివృద్ధి అంశాలతో పాటు, మంచినీరు, పచ్చదనం, హరిత గ్రామాల వంటి సామాజికాభివృద్ధి, మానవాభివృద్ధి అంశాల్లోనూ ఇప్పటికే అగ్రస్థానాలకు చేరిన తెలంగాణ, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం వంటి పలు ఇతర రంగాలలో కూడా వేగంగా ముందుకు పోతున్నది.

విశేషమేమంటే, దేశం స్వతంత్రం కాక ముందు బ్రిటిష్ వలస పాలనాకాలం నుంచి కూడా కేరళ, తమిళనాడు, కర్ణాటక రాజ్యాలు విద్య, వైద్యం, సంక్షేమం, సంస్కరణలు, సామరస్యతల వంటి రంగాల్లో తక్కిన భారత దేశం కన్న ముందడుగులో ఉన్నాయి. సమస్యలు లేవనికాదు. కానీ, అనేక విధాలుగా మెరుగుగా ఉన్నాయి. ఇప్పుడు ఆ మూడు రాష్ట్రాలలో లేని అనేక గొప్ప పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయి. సంతోషించదగినదేమంటే, వందల ఏండ్ల ఫ్యూడల్ నేపథ్యం, దశాబ్దాల అంతర్గత పాలన నుంచి బయటపడి ఇంకా పదేండ్లయినా పూర్తికాని తెలంగాణ ఈ తీరున ఆర్థికాభివృద్ధి, మానవాభివృద్ధి సాధిస్తున్నదంటే, అది అద్భుతానికి తక్కువ కాదని అనదగిన అద్భుతమే.

త్వరలో ఎన్నికలు రాబోతున్నాయి. ప్రజల మరో ఐదేండ్ల భవితవ్యం మరోసారి ప్రకటితం కాబోతున్నది. ప్రజల చేతిలోకి రాబోతున్న ఓటు అనే మహాయుధం ఎంతవరకు సద్వినియోగం అవుతుందో చూడవలసి ఉన్నది. ఈ రోజు మొత్తం దేశాన్ని పాలిస్తున్న బీజేపీ నేత ఒకప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రి. ఆయన హయాంలో గుజరాత్ ఉన్నతమైన అభివృద్ధి సాధించిందనే ప్రచారం ఒకటి మనం మొదటినుంచి వింటున్నాం. అది నిజమేనా అనేది పక్కన పెడితే, అనతి కాలంలోనే అంతకు మించిన అభివృద్ధిని సాధించిన తెలంగాణను చూస్తే వాస్తవం బోధపడుతుంది. అన్నిరంగాలలోనూ గుజరాత్, తెలంగాణలను తులనాత్మకంగా పరిశీలిస్తే ఈ ప్రచారంలోని డొల్లతనం తెలుస్తుంది.

నేటి గెలుపు రేపటి మలుపు

నీతి ఆయోగ్ ఆరోగ్య సూచిక గుజరాత్‌లో 6గా ఉంటే తెలంగాణలో 3. గుజరాత్ పన్నులు వేయడంలో 9 శాతంగా ఉంటే తెలంగాణలో 1 శాతంగా ఉన్నది.

తెలంగాణ పౌరులుగా మనం కొన్ని వాస్తవాలు తెలుసుకోవలసి ఉన్నది. తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ బాధ్యతలు తీసుకున్న వెంటనే సబ్బండ వర్గాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని అయన కొన్ని ప్రణాళికలు ప్రకటించారు. ప్రకటితాంశాలు నీళ్లు, నిధులు, నియామకాలనేవి నేపథ్యంగా ఉన్నవే. అన్నివర్గాల ప్రజలకు అవకాశాల సమవిభజన, మౌలిక వసతుల కల్పన ప్రధానంగా ఈ ప్రణాళికలు నిలబడ్డాయి. ఈ అంశాల ప్రణాళిక రచన సరే, వాటిని అమలులోకి తేవడం కూడా ఎంత ప్రభావవంతంగా జరిగిందో కొన్ని నిజాలను పరిశీలిస్తే తెలియవస్తుంది. గుజరాత్, తెలంగాణల సామ్య భేదాల గణన దీనికి అద్దం పడుతుంది.

గుజరాత్ వయసు ఇప్పటికి 63 ఏండ్లయితే తెలంగాణ వయసు పదేండ్లు. గుజరాత్ భౌతికావరణ 1.92 లక్షల చదరపు కిలోమీటర్లు. తెలంగాణ 1.12 లక్షల చదరపు కిలోమీటర్లు. తెలంగాణ జనాభా 3.8 కోట్లు గుజరాత్‌లో 7.06. తెలంగాణలో శ్రామిక శక్తి 44 శాతం.అదే గుజరాత్‌లో 41శాతం. అటవీ భూభాగం తెలంగాణలో 27.06 అయితే గుజరాత్‌లో 11.15. తెలంగాణలో వ్యవసాయానికి నీటిపారుదల 52 శాతం ఉంటే గుజరాత్‌లో 23 శాతం.

ఒక సర్వే ప్రకారం గుజరాత్‌లో సగటున ఒక వ్యక్తికి అందుతున్న నీళ్లు 77 లీటర్లు. అదే తెలంగాణలో 150 లీటర్లు. తెలంగాణలో ఈ విధంగా వంద శాతం నీళ్లు ఇవ్వడాన్ని ఒక సందర్భంలో మోదీ కూడా ప్రశంసించడం ఇక్కడ గమనించాలి. గుజరాత్ ఐటీ రంగానికి వస్తే ఇతర కంపెనీలతో కూడా కలుపుకొని 34,028 అయితే తెలంగాణలో ఈ పరిశ్రమలు ఐటీ కలుపుకొని 47,176 ఉన్నాయి. తెలంగాణలో ఉద్యోగాల ద్వారా కల్పించబడుతున్న ఉపాధి 1.8 కోట్లు అంటే 45 శాతం అయితే గుజరాత్‌లో 2 కోట్లు అంటే 31 శాతం మాత్రమే.

వర్తమానంలో కొనసాగుతున్న ధరల ప్రకారం జీఎస్‌టీపీ డెవలప్ మెంట్ రేట్ గుజరాత్‌లో 10.57 శాతం అయి తే తెలంగాణలో 19.1గా చూడవచ్చు. తెలంగాణలో తలసరి ఆదాయం రూ.3,17,115గా ఉంటే గుజరాత్ లో రూ.2,50,100గా గమనించవచ్చు. గుజరాత్, తెలంగాణలలోని అభివృద్ధి శాతం 10.7,20.5గా ఉండటాన్ని బట్టి తెలంగాణ అభివృద్ధిని అంచనా వేయవచ్చు. ఇక ఆదాయ వృద్ధిరేటు తెలంగాణలో 17.81 అయితే గుజరాత్‌లో 1.36 మాత్రమే. తెలంగాణలో తలసరి విద్యుత్తు వినియోగం 2,012 అయితే గుజరాత్ వినియోగం 1,839గా గమనించాలి. ఇప్పటికి శిశుమరణాల రేటు గుజరాత్‌లో 1000కి 23 అయితే తెలంగాణలో 20 మాత్రమే. ఇన్నోవేషన్ ఇండెక్స్ ర్యాంక్ గుజరాత్ 5 అయితే, తెలంగాణ 2వ స్థానంలో ఉంది. ఈ విషయంగా తెలంగాణ 3 స్థానాలు అధికంగా ఉండటం చూడవచ్చు. ఇప్పటివరకు గుజరాత్ సాంఘిక సంక్షేమ వాణిజ్య సూచిక 8 అయితే తెలంగాణలో 1. అంటే తెలంగాణ 7 స్థానాలలో అధికంగా ఉండటం గమనించవచ్చు.

వాస్తవాలను గమనించకుండా తెలంగాణలోని ప్రతిపక్షాలు చేసే విమర్శలు నిర్హేతుకాలు. హస్యాస్పదాలు. పైగా వాళ్లు బహిరంగ సభల్లో ప్రసార మాధ్యమాల్లో ఉపయోగిస్తున్న భాష వాళ్లను వాళ్లు తక్కువ చేసుకోవడమే. దేశం పట్ల, సమాజం పట్ల, సిద్ధాంత నిబద్ధత ఉన్ననాయకుడు ఎవరూ ఇట్లాంటి భాషను వాడరు. మహిళా నాయకుల మీద కూడా తమ కీచక భాషను ప్రయోగించడం అత్యంత హేయం. ఒక స్పష్టమైన నిబద్ధతను, సంస్కారాన్ని వీరి దగ్గర ఆశించడం అత్యాశే కావచ్చు కానీ, వీళ్లకు కనీసం ప్రజాసమూహాల ముందు గంభీరత నటించడం కూడా రాదంటే జాలి కలుగక తప్పదు. నాయకుని మాట ఎప్పుడైనా ప్రజలను దేశాన్ని ప్రతిఫలిస్తుందని గమనించాలి.

పెరిగిపోతున్న సాంకేతిక పరిజ్ఞానం గ్లోబలైజేషన్ సంస్కృతి వల్ల కుటుంబ సంబంధాలు ప్రశ్నార్థకమౌతున్నాయి. నైతికతకు స్థానంలేని ఒక చిత్రమైన భౌతిక సమాజం నిర్మాణం జరుగుతున్నది. ఇట్లాంటి అవకాశవాద యుగంలో తన వాగ్దానాలను నిలుపుకొనే నాయకత్వం చాలా అరుదుగా కనిపిస్తున్నది. చేసిన వాగ్దానాలే కాక అదనపు అంశాలు కూడా పూరించే నాయకత్వం తెలంగాణకు లభించింది. ఈ రోజు తెలంగాణ జాతి తలెత్తుకొని సగర్వంగా నిలబడగలుగుతున్నది. తెలంగాణ చరిత్రలో సాహిత్య, సాంస్కృతిక పేజీలు ప్రత్యేకంగా తెరచుకొన్నాయి. తెలంగాణ విధానాలను సమస్త దేశమూ చవిచూడవలసిఉన్నది. రేపు మనదే అని చాటుతున్న ఈ ఎన్నికలలో విజయం, ఒక్క తెలంగాణకే కాదు , సమస్త దేశానికీ మేలుకొలుపే.

- డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు
అసోసియేట్ ఎడిటర్, తంగేడు మాసపత్రిక

- పి.విజయేందర్ రావు
అధ్యాపకుడు